# నిష్కృతి

"నీ పెళ్ళయి మూడేళ్ళు దాటినట్టుంది కదా?" అన్నాడు వెంకటేష్ చేతిలో ఉన్న విస్కీ గ్లాసును పెదవులకు అంటించుకుంటూ.

"అవును....యేం?" అన్నాడు రమణమూర్తి విస్కీ సిప్ చేసి గ్లాస్‌ను టీపాయ్ మీద పెడ్తూ

"యేం లేదు..... ఊరికేనే అడిగాను" అన్నాడు వెంకటేశ్ సిగరెట్ వెలిగించుకుంటూ

రమణమూర్తి కూడా సిగరెట్ వెలిగించి గుండెలనిండా పొగ పీల్చుకొని వెంకటేశ్ కేసి తీక్షణంగా చూశాడు.

"నువ్వు ఊరికేనే అడగలేదు లేరా...... ఆప్రశ్న ఎందుకడిగావో నాకు తెలుసు...."

"ఎందుకడిగానంటావు?"

"మూడేళ్ళయింది...... నీకింకా పిల్లలు పుట్టలేదేమిటి అని అడగదల్చుకున్నావు..... అంతేనా?"

"పోనీయ్ అంతే అనుకో..... ఆప్రశ్న అడుగుతున్నది నేనొక్కడినేకాదు..... మన ఆఫీసులో కూడా చాలామంది అడుగుతున్నారు. రమణమూర్తి గొప్ప రసికుడు కదా.....అతని కింకా పిల్లలు పుట్టకపోవడమేమిటని ఒకరి చెవులొకరు కొరుక్కుంటున్నారు...."

"రసికత్వానికీ, పిల్లలు పుట్టకపోవడానికీ ఎలాంటి సంబధముండదని ఆమూర్ఖులకు తెలీదేమొ..... అయినా నాకు పిల్లలు పుట్టకపోవడం వల్ల వాళ్ళకేమిటి నష్టం?"

"సమాజం ఊరుకోదు కదా...... పెళ్ళీడు రాగానే పెళ్ళికాలేదనుకో....వీడికింకా పెళ్ళెందుకు కాలేదు అంటారు. పెళ్ళయిందనుకో, పిల్లలెందుకు పుట్టలేదంటారు.... ఐదారుగుర్ని కన్నావనుకో, ఈ రోజుల్లో వీడు ఐదాగుర్ని కనడమేమిటి అంటారు. సమాజం అనే కత్తికి రెండు వైపులా పదునుంటుంది........"

"ఉంటే ఉండనీయ్.... ఐడోంట్‌కేర్...."

"అంటే నువ్వు పిల్లల్ని కననే కనవా?

"పిల్లల్నీ కనేది మనం కాదుకదా!"

"అంటే...?

"ఆడవాళ్ళు మాత్రమే పిల్లల్ని కనగలరు. మగవాళ్ళు కలల్ని మాత్రమే కనగలరు...."

వాళ్ళు మొదటి రౌండ్ పూర్తి చేశారు. వెంకటేశ్ రెండు గ్లాసుల్లో మరో పెగ్ విస్కీ పోశాడు. మరోసారి సిగరెట్టు వెలిగించుకొని విస్కీ సిప్ చేస్తూ టీపాయ్ మీది ప్లేట్లో ఉన్న వేయించిన పల్లీలను నమలసాగారు.

"నువ్వన్నది నిజమే అనుకో.... కానీ ఆడవాళ్ళు పిల్లల్ని కనడానికి బీజం వేసేది మగవాళ్ళే కదా..... స్త్రీని క్షేత్రం అన్నారు. పురుషుడు ఆక్షేత్రంలో బీజం వేసి పంటలు పండిచాలని పెద్దలు చెప్పారుకదా......"

"బీజాలకేం....పురుషుడు ఎన్ని బీజాలైనా వెయ్యగలడు......నీకు తెలుసా?. పురుషుడు ఒక్కసారి స్ఖలిస్తే కొన్ని కోట్ల విత్తనాలు స్త్రీ గర్భంలో ప్రవేశిస్తాయి. అదే స్త్రీ నెలకొక్కసారే ఒక్క ఎగ్‌ను మాత్రమే రిలీజు చెయ్యగల్గుతుంది. పిల్లలు పుట్టాలంటే పురుషుడి నుండి విడుదలయ్యే కోట్ల శుక్లకణాల్లో ఒక్క కణం స్త్రీ నుండి నెలకోసారి విడుదలయ్యే ఎగ్‌ను కలుసుకోవాలె. కాబట్టి నేనేమంటానంటే సంతానం కల్గటానికిగానీ, కల్గకపోవటానికిగానీ నూటికి తొంబై తొమ్మిదిపాళ్ళు స్త్రీయే కారణమౌతుందని".

"నీకు సైన్స్ బాగా తెలుసునని నాకు తెలుసనుకో. సైన్స్ తెలీని వాళ్ళు కూడా పిల్లలు పుట్టకపోవడానికి స్త్రీలే కారణమనుకుంటారు."

ఆఇద్దరు మిత్రులు రమణమూర్తి ఇంట్లోని డ్రాయింగ్ రూంలో కూర్చొని విస్కీ సేవిస్తున్నారు. వాళ్లిద్దరూ హైస్కూలు డేస్ నుండి పోస్టుగ్రాడ్యుయేషన్ డేస్ వరకు క్లాస్ మేట్స్. ఇద్దరికీ ఒకటే డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు దొరికాయి. ఆనాటి నుండి ఈనాటి వరకు వాళ్ళ స్నేహం చెక్కు చెదరలేదు. రోజు ఎక్కడో ఒకచోట కలుసుకొని పెగ్గుమీద పెగ్గుల విస్కీ సేవించడం వాళ్ళిద్దరికీ చాలా చాలా ఇష్టమైన పని.

రెండో రౌండ్ కూడా పూర్తి చేసి మూడో రౌండ్‌లో కొచ్చారు. విస్కీలో కలుపుకోవడానికి తెచ్చుకున్న సోడా బాటిల్స్ ఖాళీ అయిపోయాయని గమనించిన రమణమూర్తి " ఊర్మిళా! ఫ్రిజ్‌లో ఉన్న వాటర్ బాటిల్ తెచ్చివ్వు " అంటూ కేకేశాడు.

లోపల్నించి రమణమూర్తి భార్య ఊర్మిళ వాటర్ బాటిల్ తెచ్చి టీపాయ్ మీద పెట్టేసి లోపలకు వెళ్ళబోయింది.

"ఊర్మిళా! వెంకటేశ్ యేమంటున్నాడో విన్నావా?" అన్నాడు రమణమూర్తి
.

ఏమంటున్నాడు అన్నట్టుగా ఆమె భర్త కేసి చూసింది. "మీకింకా పిల్లలు పుట్టలేదేమిటి? అంటున్నాడు."

ఆమాట ఆమెలో ఎలాంటి సంచలనాన్ని సృష్టించలేదు. ఆమె అతనికేమీ సమాధానం చెప్పకుండానే లోపలకు వెళ్ళిపోయింది.

వాళ్ళు గాసుల్లో విస్కీ పోసుకొని, నీళ్ళు కలుపుకొని, సిగరెట్లు వెలిగించకొని స్మోక్ చేస్తూ, సిప్‌చేస్తూ మరో ప్రపంచలోకి వెళ్ళిపోసాగారు.

"తినడానికేం లేనట్టుందే?" అన్నాడు వెంకటేశ్ టీపాయ్ మీదున్న ప్లేట్లో పల్లీలు అయిపోయాయని గమనించి.

"ఊర్మిళా! ఉల్లిపాయలు బాగా వేసి రెండు ఆమ్లెట్లు వేసి తీసుకురా....త్వరగా....."అంటూ కేకేశాడు రమణమూర్తి.

"అలాగేనండీ!" అంది ఉర్మిళ.

"ఈమధ్య మన బాస్‌గాడి పి.ఎ జయకుమారి ఆఫీసుకు రావడం లేదేమిటి.?" అన్నాడు వెంకటేశ్.

"నీకు తెలీదా.....ఆమె ప్రెగ్నెంట్....చాలా రోజుల దాకా రాదు....."

"వ్హాట్! ప్రెగ్నెంటా? ఆమెకింకా పెళ్ళేకాలేదు.ప్రెగ్నెంటేమిటి?"

"ఎందుకంత ఆశ్చర్యపడ్తున్నావు? పెళ్ళికాకుండా ప్రెగ్నెంట్ కాకూడదా?"

"కాకూడదని కాదు... కానీ జయను చూస్తే అలా అనిపించదే... చాలా గుట్టుగా, గుంభనంగా ఉంటుంది. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడనే మాట్లాడదు... అఫ్‌కోర్స్! నీ ఒక్కడితోనే చాలా క్లోజ్‌గా ఉంటుంది... కొంపదీసి ఆమె ప్రెగ్నెన్సీకి నువ్వుకారణం కాదు కదా?..."

రమణమూర్తి నర్మగర్భంగా నవ్వాడు.

"ఆమె గర్భానికి నువ్వైనా కారణం కావాలి... లేదా మన బాసైనా కారణం కావాలి."

"మన బాసుగాడికి అంత ధైర్యమెక్కడుందిరా... వాడికి వాడి పెళ్ళామంటే చచ్చేంత భయం..."

"అయితే ఆఘనకార్యం చేసింది నువ్వేనన్న మాట..."

"కరెక్ట్‌గానే గెస్ చేశావే.." అంటూ రమణమూర్తి విజయగర్వంతో నవ్వాడు.

"అంత డిగ్నిఫైడ్‌గా ఉండే ఆమెను ఎలా పడేశావురా... ఆ ట్రిక్స్ యేమిటో నాక్కూడా చెప్పవూ?"

"నాకు చాలాసార్లు మనబాసు దగ్గరకెళ్ళేపని బడ్తుందికదా... వెళ్ళినప్పుడల్లా ఆమెను పలకరించేవాడిని. ఆమెకేమన్నా పనిబడ్తే చేసి పెట్టేవాడిని... వాళ్ళ తమ్ముడికి ఇక్కడ ఓ ప్రైవేట్ కాలేజిలో లెక్చరర్‌గా జాబిప్పిచ్చాను. వాళ్ళ చెల్లెలికి ఇక్కడి ఉమెన్స్ కాలేజిలో బి.ఎస్‌సీలో సీటిప్పిచ్చాను.. ఇట్లా స్లోగా ఆమెకు దగ్గరయ్యాను... ఎప్పుడవకాశమొచ్చినా నీ అంత అందమైన స్త్రీని, నీఅంత బుద్ధిమంతురాలైన స్త్రీని, నీ అంత సమర్థవంతురాలైన స్త్రీని నేనీ ప్రపంచంలో చూళ్ళేదని పొగిడేవాడిని... అంతే... పడిపోయింది..."

"ఇంత కథ నడిచిందా? నాకు తెలియనే తెలీదు."

"నీకెలా తెలుస్తుందిరా... ఎప్పుడూ నువ్వ టూర్స్‌లోనే ఉంటావుకదా"

"వామ్మో... యేమొ అనుకున్నాను... గుండెలు తీసిన బంటువే... అంత గుట్టుగా ఉండే జయకుమారికే గర్భం తెప్పించావంటే..."

" ఆ మాట గట్టిగా అనకు... ఊర్మిళ విన్నదంటే పెద్దగొడవైపోతుంది..."

"అనములేరా... అంటే మాత్రం యేమౌతుంది? నువ్వు మన బాసుగాడిలా పెళ్ళానికి భయపడేవాడివి కాదు కదా..."

"అవుననుకో... పెళ్ళానికి భయపడేవాడు కూడా ఒక మనిషేనా... యేమిటి.. ఇదింకా మనకు ఆమ్లెట్లు తెలేదా? ఊర్మిళా.. ఆమ్లెట్లేవి?" రమణమూర్తి అరిచాడు.

"తెస్తున్నానండి... ఇంకొక్క ఐదునిమిషాలు" లోపల్నుండి ఊర్మిళ.

"ఇంకా ఐదు నిమిషాలా? టూమచ్! ఈ ఆడవాళ్ళు యేపని చేసినా ఇంతే... ఐదు నిమిషాల్లో చేసే పనికి ఐదుగంటలు తీసుకుంటారు... ఛీఛీ! మేమూ మగవాళ్ళతో సమానమని ఫోజులు కొడ్తారు" అంటూనే రమణమూర్తి తన విస్కీ గ్లాసులో ఉన్న విస్కీ మొత్తం ఏకబిగిన తాగేశాడు.

మూడో రౌండ్ పూర్తిచేసి నాల్గో రౌండ్లో ప్రవేశించారు. మళ్ళీ సిగరెట్లు వెలిగించారు.

"ఇప్పుడు జయకుమారి యేంచేస్తుందంటావు"?

"సీక్రెట్‌గా యే హైదరాబాద్‌కో వెళ్ళి అబార్షన్ చేయించుకొని వస్తుంది. దాని గొడవ మనకెందుకులేరా... వదిలేసెయ్..."

"మనకెందుకేమిటి? అది మన లవర్ కదా... మన వల్లనే దానికి కడుపొచ్చిందికదా..."

"షటప్ బ్లడీఫూల్! మనలవరేమిట్రా? నీకేమైనా బుద్ధిందా? అది నాలవర్... మనలవర్... మనలవరని నిన్ను కలుపుకుంటున్నావేమిటి? దాని లవర్ కావాలన్న నీకున్న కోరికను ఇలా తీర్చుకుందామనుకుంటున్నావా? యూ ఆర్ ఎ జెలస్ బాస్టర్డ్... మరోసారి మన లవర్ అన్నావంటే తంతాను... దానికేసి కన్నెత్తి చూసినా తంతాను... షీ ఈజ్ మై లవర్... వోన్లీ మైలవర్...""

"సారీ బ్రదర్... సారీ... వెరీవెరీ సారీ... నీ ఇంట్లో కూర్చొని, నువ్వు సర్వ్ చేస్తున్న విస్కీ తాగుతూ నీకే అపకారం తలపెట్టాను... దాన్ని నేనూ ఓ పట్టు పట్టాలన్న కోరిక నాకు తెలియకుండానే నాకు కల్గింది... సారీ బ్రదర్.. నాకీ దుర్బుద్ధి పుట్టినందుకు సారీ... నన్ను క్షమించు బ్రదర్... నన్నునేనే క్షమించుకోలేను.. నువ్వెలా క్షమిస్తావు బ్రదర్..." అంటూ వెంకటేశ్ యేడ్వటం మొదలెట్టాడు.

"స్టూపిట్.. యేడ్పు ఆపెయ్... లేకపోతే తంతాను.. నవ్వే ఆడదన్నా, యేడ్చే మగవాడన్నా నాకు అసహ్యం... పరమ అసహ్యం..."

" ఆపేస్తాను బ్రదర్.... నీమీదొట్టు.... యేడ్పును...ఆపేశాను. నోక్రైయింగ్..."

ఊర్మిళ వాళ్ళ కూర్చున్న గదిలోకొచ్చి టీపాయ్ మీదున్న ప్లేట్లో రెండు వేడి ఆమ్లెట్టు పడేసింది.

"యేమే భార్యామణి! త్వరగా ఆమ్లెట్లు వేసి తీసుకరమ్మంటే ఇంత సేపు చేస్తావా? నీకు పిల్లల్ని కనడం ఎలాగూ చేతకాదు.కనీసం ఆమ్లెట్లన్నా వేసి తీసుకరావడం చేతకాకపోతే నువ్వెందుకు పనికొస్తావే? యూఆర్‌నాట్ ఫిట్టుబీ మైవైఫ్.... నాటెటాల్ ఫిట్టుబీ మైవైఫ్... గెటౌట్...." రమణమూర్తి పెద్దగా అరిచాడు.

"ఇంట్లో ఎగ్స్ లేవండి.... బయటకెళ్లి తెచ్చి......"

"ఇంట్లో ఎగ్స్‌లేవు..... నీవంట్లో కూడా ఎగ్స్‌లేవు. నువ్వేం ఆడదానివే.... వెళ్ళిపో....నాఇంట్లోంచి వెళ్ళిపో......ఇప్పుడే.... ఈక్షణమే...గెటౌట్.... గెటౌట్..."బిగ్గరగా అరిచాడతడు.

"వరే రమణా! యేమిట్రా ఇది. అర్ధరాత్రి భార్యను ఇంట్లోంచి వెళ్ళిపొమ్మంటావా? అన్యాయంరా..... నాకళ్ళముందే నాసోదరికింత అన్యాయం జరుగులోంటే నేను చూళ్ళేనురా.....నాఅంతరాత్మ ఘోషిస్తున్నది...ఈఅన్యాయాన్ని

ఆపమని....వద్దురా.... నాసోదరికింత అన్యాయాం చెయ్యొద్దురా! “అంటూ వెంకటేశ్ మళ్ళీ భోరుమని యేడ్వటం మొదలెట్టాడు.

“షటప్ యూ బాస్టర్డ్... భార్యభర్తలు పోట్లాడుకుంటున్నప్పుడు మధ్యలో ఎవ్వరూ జోక్యం చేసుకోకూడదు..ఇంత చిన్న విషయం కూడా తెలీదురా నీకు...డర్టీఫెలో.... ఇంతకు ముందే నువ్వేమన్నావు... నీకింకా పిల్లలెందుకు పుట్టలేదని అడిగావా.... లేదా? అదేదో నాతప్పున్నట్టు మాట్లాడావా లేదా? చెప్పు.. నిజం చెప్పు.... నిజంచెప్పకపోతే చంపేస్తా....” గద్దించినట్టుగా అన్నాడు రమణమూర్తి.

“నీతప్పని అన్లేదురా రమణా! అపార్థం చేసుకోకురా.... మీకు పిల్లలు లేరేమిటి అని మామూలుగా అడిగానంతే.... అపార్థం చేసుకోకురా... మీకు పిల్లలు పుట్టకపోవడానికి నీతప్పేమి లేదురా....ఊర్మిళ తప్పుకూడా లేదురా...ఊర్మిళా... వాడలాగే వాగుతాడు గానీ నువ్వు లోపలకెళ్ళమ్మా! “అన్నాడు వెంకటేశ్.

“దాన్ని.... నాపెళ్ళాన్ని లోపలకెళ్ళమని చెప్పడానికి నువ్వెవడివిరా? దాని తప్పు లేదని చెప్పడానిక్కూడా నువ్వెవడివిరా? మాకు పిల్లలు పుట్టకపోవడానికి కారణం ఇదే... ఇదో గొడ్రాలు. దీనికి పిల్లలు పుట్టరు. దీన్ని వదిలేసి ఇంకో దాన్ని చేసుకుంటే తప్ప నాకు పిల్లలు పుట్టరు. వెళ్ళిపో... ఈ క్షణమే వెళ్ళిపో...” అన్నాడు రమణమూర్తి గ్లాసులో ఉన్న విస్కీ మొత్తాన్ని ఒకే సారి సిప్‌చేసి.

“అలాగే వెళ్ళిపోతాలే.. పిల్లలు కనేదాన్నే తెచ్చి చేసుకో... ఈ ఆమ్లెట్లు చాలా? ఇంకేమన్నా కావాలా?” అందామె లోపలకెళ్ళడానికి సిద్ధమౌతూ.

“పిల్లలు కావాలె.. పిల్లలు.. ఇప్పుడు... ఈక్షణం... ఇస్తావా?” కళ్ళుమూస్తూ తెరుస్తూ అన్నాడు రమణమూర్తి.

“అలాగే ఇస్తాగానీ ఈ దిక్కుమాలిన తాగుడిక ముగించండి. ఇవ్వాళ్ళ చాలా ఎక్కువైపోయింది... వెంకటేశన్నయ్య ఈ రాత్రి చాలా దూరం స్కూటర్ డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళాలె. ఆయనకేమన్నా అయితే ఆ పాపం మనకే తగులుద్ది” అంది ఊర్మిళ.

“నిజమేరా రమణ... పది దాటింది... ఇక ముగిద్దాం... నేను స్కూటర్ మీద ఇరవై కిలోమీటర్లు వెళ్ళాలె... నన్నిక వదిలెయ్‌రా..” అన్నాడు వెంకటేశ్.

“షటప్ యువర్ బ్లడీ మౌత్... అది ముగించమంటే ముగిస్తావా... ముగించమని చెప్పడానికదెవతి? అదేమన్నా మన బాసా? మనమేన్నా దాని బానిసలమా? అదే మన బానిస... పెళ్ళామంటే మొగుడికి బానిస... కార్యేషు దాసి

అని పెద్దలు చెప్పారా? లేదా? తాగుడు ముగించండి అని అది మనకు చెప్పేంత సాహసం చేస్తుందా? నీకు పొగరెక్కిందే... ఈ మధ్య తన్నుల్లేవుగా... అందుకే పొగరెక్కింది... నీ పొగరెలా అణచాలో నాకు బాగా తెలుసు... ముక్కెలిరగతంతాను... బ్లడీ బిఛ్..." అంటూ లేచినిల్చొని ఆమె మీదకు వెళ్ళబోయి, ఒక్క అడుగు ముందుకువేసి, దభీమని టీపాయ్‌మీద పడిపోయాడు.

"వీడీ రోజు ఇంత త్వరగా ఔటయిపోయాడేమిటి? ఆరు పెగ్గులు తాగినా నిభాయించుకునేటోడు... ఈరోజు వీడికేమయ్యిందో..." అంటూ వెంకటేశ్ "అరే రమణా! యేమైందిరా?" అంటూ అతన్ని టీపాయ్ మీదినుండి లేపటానికి ప్రయత్నించాడు.

రమణమూర్తికి స్పృహలేదు.

వెంకటేశ్, ఊర్మిళ కలిసి అతన్నిలోపలికి, బెడ్‌రూంలోకి అతికష్టంగా తీసికెళ్ళి బెడ్‌మీద పడుకోబెట్టారు.

* * *

వారం రోజుల తర్వాత రమణమూర్తి, ఒక్కడే వాళ్ళ బెడ్‌రూంలో విస్కీతాగుతూ, సిగరెట్లు పీలుస్తూ కూర్చున్నాడు. ఊర్మిళ వంటగదిలోంచి అప్పుడే వండిన చికెన్‌కర్రీ తెచ్చి అతని ముందుపెట్టింది.

"ఏయ్ ఊర్మిళా! నీకు మరొసారి చెబుతున్నా... నాకు పిల్లలు కావాలె... పిల్లలు... నువ్వు పిల్లల్ని కనలేవని తేలిపోయింది. నువ్వో గొడ్రాలువని రుజువైపోయింది. వెళ్ళిపో... నా ఇంట్లోంచి వెళ్ళిపో..." అన్నాడు రమణమూర్తి.

"కాదు... నేను గొడ్రాల్ని కాను. మనకు పిల్లలు పుట్టకపోవడానికి నేను కారణం కాదు. మొన్ననే డాక్టరమ్మ దగ్గరకు వెళ్ళాను.. అన్నీ పరీక్షలు చేసి నీలో యేలోపమూ లేదని చెప్పింది. నీ భర్తనొకసారి తీసుకరమ్మంది"

"ఎందుకు?"

"మీక్కూడా కొన్ని పరీక్షలు చెయ్యాలట.."

"నాకు పరీక్షలా? బుద్ధుండే మాట్లాడుతున్నావా?"

"బుద్ధుండే మాట్లాడుతున్నాను. పిల్లలు లేనప్పుడు భార్యాభర్తలిద్దరికీ పరీక్షలు చేస్తారు"

"నాకే పరీక్షలూ అక్కర్లేదు నాలో యేలోపమూ లేదు..."

"యేలోపమూలేదని అంత నమ్మకంగా ఎలా చెప్పగలరు..."

"చెప్పగలను... రుజువులున్నాయి. నా కారణంగా ఇద్దరు స్త్రీలు గర్భవతులయ్యారు. నిన్ను పెళ్ళి చేసుకోకముందు నేనో అమ్మాయిని ప్రేమించాను. ఆమెనే పెళ్ళిచేసుకుందామను కున్నాను. కానీ ఆమె తల్లిదండ్రులు మా పెళ్ళికి అంగీకరించలేదు. అంతకు ముందే మేమిద్దరం కలుసుకునే వాళ్ళం. ఆమె గర్భవతయ్యింది. ఆ విషయం వాళ్ళ తల్లిదండ్రులకు చెప్పాం. అయినా వాళ్ళు మా పెళ్ళికి అంగీకరించలేదు. ఆమెకు బలవంతంగా అబార్షన్ చేయించి మరొకరికిచ్చి పెళ్ళి చేశారు. ప్రేమించినదాన్ని పెళ్ళి చేసుకోలేకపోయానన్న వైరాగ్యంలో పడిపోయి యేరాయైతే యేంలే, పళ్ళూడగొట్టుకోవడానికనుకొని నిన్ను చేసుకున్నాను. మూడేళ్ళయిపోయింది. మనకో కొడుకు పుడ్తే వాడిలో మానాన్నను చూసుకోవాలని మా అమ్మ ఎదురుచూస్తోంది. మా నాన్న ఐదేళ్ళ క్రితమే చనిపోయాడు. నాకో కొడుకు పుడ్తే చూడాలని కలలుగంటున్న మా అమ్మ కలల్ని నువ్వు భగ్నం చేశావు. నువ్వు నాకక్కర్లేదు. మర్యాదగా నా ఇంట్లోంచి వెళ్ళిపో..."

"చాలా ఘోరంగా మాట్లాడుతున్నారు.. నాలో యేలోపమూ లేదంటే నమ్మరేమిటి? కావాలంటే డాక్టర్ దగ్గరకు వెళ్దాం పదండి..."

"నాలో కూడా యేలోపమూలేదు. నేను యే డాక్టర్ దగ్గరకూ రాను. నిన్నగాక మొన్న మా ఆఫీసులో పనిచేసే పి.ఏ. జయకుమారి నాకారణంగా ప్రెగ్నెంటయ్యింది. ఆమె, నేనూ లవర్స్మని మా ఆఫీసులో అందరికీ తెలుసు"

"చేసుకున్నదానితోటే మరొకదానితో సంబంధముందని చెప్పడానికి మీకు సిగ్గులేదూ?"

"నన్ను... నన్ను... సిగ్గులేదంటావా?" అంటూనే అతడు ఆమె చెంప ఛెళ్ళుమనిపించాడు.

"కొట్టండి... చంపండి... మగవాడిని కాబట్టి యేం చేసినా చెల్లుతుందను కుంటున్నామేమొ... మరోసారి నా మీద చెయ్యిచేసుకుంటే... ఊరుకోను..." అందామె ఉబికి వస్తున్న కన్నీళ్ళను ఆపుకుంటూ "ఊరుకోక యేం చేస్తావే... యేం చేస్తావు? నీకు చివరిసారిగా చెబుతున్నాను... నీలాంటి గొడ్రాలు దానితో నేనిక కాపురం చెయ్యను..." అన్నాడతడు.

"నన్ను మరోసారి గొడ్రాలుదానివంటే నీ మర్యాదక్కదు..." అందామె అతనికేసి తీక్షణంగా చూస్తూ

"అంటాను... వందసార్లంటాను... యేంచేస్తావే, యేం చేస్తావు? చెంపదెబ్బతో సరిపోదు. నిన్ను తన్నాలి... కుళ్ళబొడవాలి... అప్పుడుగానీ..." అంటూ అతడు విస్కీగ్లాసు చేతిలో పట్టుకొని ఆమె మీదకు రాబోయాడు.

"అక్కడే ఆగండి... నావంటి మీద మరోదెబ్బ పడ్తే నీవంటిమీద పదిదెబ్బలు పడ్తాయి.. మత్తుతో జోగుతున్న నిన్ను కొట్టడం పెద్ద సమస్యకాదు. ఇంతకాలం నువ్వు తిట్టినా, కొట్టినా, తాగితందనాలాడినా భరించాను. దేనికైనా ఒక హద్దుంటుంది. నువ్వా హద్దు దాటావు... నిన్నిక భరించే శక్తిగానీ, ఓపికగానీ నాకు లేవు.. రేపే నీ తరపున నా తరపున పెద్ద మనుషుల్ని పిలుద్దాం. నువ్వు వద్దంటున్నా నీదగ్గర పడుండే ఖర్మ నాకేం పట్టలేదు."

"పిలుద్దాం... రేపే పెద్దమనుషుల్ని పిలుద్దాం. నువ్వెవర్ని పిలుచుకుంటావో పిలుచుకో... నేను మా అన్నల్ని, మా అక్కనూ, మా బావనూ, మా అమ్మనూ పిలుచుకుంటాను."

"నేనూ మా అన్నల్ని, మా అక్కల్ని, మా బావల్ని పిలుచుకుంటాను"

* * *

ఆమర్నాడు ఉదయమే ఇరుపక్షాల వారూ వచ్చారు.

రోజంతా చర్చించారు.

ఆమెదే తప్పని అతని తరుపువాళ్ళు, అతనిదే తప్పని ఆమె తరపువాళ్ళు వాదించుకున్నారు. ఒకరి మీదొకరు అరచుకున్నారు. సాయంత్రం వరకు వాళ్ళిద్దరిక కలిసి కాపురం చెయ్యలేరన్న నిర్ణయానికొచ్చారు.

అతడామె పోషణకోసం రెండులక్షల రూపాయలిచ్చేట్టుగా, ఆమె విడాకుల పత్రం మీద సంతకం చేసేలా అతన్నీ, ఆమెనూ ఒప్పించారు.

ఆ విధంగా కాగితం రాశారు.

ఇద్దరితోనూ సంతకాలు పెట్టించారు.

ఊర్మిళను తీసుకొని ఆమె అన్నలూ, అక్కలూ, బావలూ వెళ్ళిపోయారు.

* * *

ఆరు నెలల తర్వాత రమణమూర్తి మరో అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు.

వాళ్ళ అక్కయ్య సుధేష్ణ ద్వారా ఆ పెళ్ళికుదిరింది.

ఊర్మిళతో విడాకుల ఒప్పందం కుదిరిన నెలరోజుల తర్వాత సుధేష్ణ రమణమూర్తి ఇంటికొచ్చింది.

"మా ఊర్లో ఓ మంచి అమ్మాయుందిరా రమణ... వాళ్ళతో మనకు బంధుత్వం కూడా ఉంది. ఆ పిల్లకు ఇరవయ్యేళ్ళో ఇరవైరెండేళ్ళో ఉంటాయి. ముక్కూ మొఖం బావుంటాయి. వాళ్ళకు పెద్దగా ఆస్తిపాస్తులంటూ యేమీ లేవుగానీ చాలా మర్యాదస్తులు..." అంది సుధేష్ణ రమణమూర్తితో.

"ఆస్తిపాస్తులక్కర్లేదులే అక్కయ్యా, అమ్మాయి మంచిదయితే చాలు.. పెళ్ళయిన ఓ సంవత్సరంలోపలే పాపనో, బాబునో కనిచ్చేదికావాలె నాకు..." అన్నాడు రమణమూర్తి.

"తప్పకుండా కంటుందిరా... అందరూ ఆదిక్కుమాలిన ఊర్మిళలాంటి గొడ్రాళ్ళే ఉంటారా..." అంది సుధేష్ణ.

"అక్కయ్య చెప్తున్న ఆ పిల్లను చేసుకోరా రమణా!" అంది రమణమూర్తి వాళ్ళమ్మ... ఊర్మిళ వెళ్ళిపోయినప్పట్నించి ఆమె రమణమూర్తి దగ్గరే ఉంటోంది.

"వెంటనే నువ్వు ఆపిల్ల తల్లిదండ్రులతో మాట్లాడవే అక్కయ్యా!" అన్నాడు రమణమూర్తి.

"మా సుహాసిని చిన్న పిల్లయిపోయిందిగానీ లేకపోతే దాన్నే నీకిచ్చి చేస్తే బావుండేదిరా..." అంది సుదేష్ణ.

"సుహాసినినా? దానికి పన్నెండుళ్ళుకూడా లేవు.. అదినాకు భార్యేమిటే..." ఆశ్చర్యంగా అన్నాడు రమణమూర్తి.

"ఆడపిల్లలు కన్నుమూసి తెరచెలోగా పెద్దవాళ్ళయిపోతారు. ఇంకో రెండేళ్ళు పెద్దదైతే మేం నిన్ను దాన్నే చేసుకొమ్మనేవాళ్ళం. మేనకోడల్ని చేసుకుంటే అదీ సుఖపడేది నిన్నూ సుఖపెట్టేది – సంవత్సరం తిరిగేలోగా నా చేతిలో పండంటి మనవడ్ని పెట్టేది" అంది శాంతమ్మ, రమణమూర్తి వాళ్ళమ్మ.

"వద్దులేవే... అదిప్పుడు చదువుకుంటోంది. దాన్నో డాక్టర్నో, ఇంజనీర్నో చెయ్యాలని మీరు కలలుగంటున్నారు. దానికిప్పుడే పెళ్ళేమిటి? నువ్వు చెప్పిన ఆ మీ ఊరి అమ్మాయి తల్లిదండ్రులతో మాట్లాడి త్వరగా ముహూర్తం పెట్టించు..." అన్నాడు రమణమూర్తి.

"ఆ అమ్మాయిని నువ్వోసారి చూడకుండానే ముహూర్తం పెట్టించమంటావా?" అంది సుధేష్ణ

"నువ్వు చూశావుకదనే... నువ్వు చూస్తే నేను చూసినట్టే" అన్నాడు రమణమూర్తి.

"నిజమే అనుకో... ఆ అమ్మాయి పేరు వసంత, చూడటానికి చాలా అమాయకురాలిగా కనిపిస్తుంది. పెద్దగా చదువుకోలేదు. వాళ్ళు చాలా పేదవాళ్ళని చెప్పానుకదా... మా ఇంట్లో ఫలాహారాలు చేసే పనో, మరేదైనా పనో ఉన్నప్పుడు ఆ అమ్మాయిని పిలుస్తుంటాను. బాగా పనిచేస్తుంది. అన్ని పనులూ వచ్చు. ఎంతిస్తే అంత తీసుకెళ్తుంది. దీనికేదన్నా సంబంధం చూడండని వాళ్ళ నాన్న, అమ్మా నాకు చాలాసార్లు చెప్పారు. మా తమ్ముడే చేసుకుంటాడంటే ఎగిరిగంతేస్తారు" అంది సుధేష్ణ.

"రెండో సంబంధమంటే వెనక్కిపోరు కదా!" అంది శాంతమ్మ. "దొరికిందే బంగారమని సంతోషంగా ఒప్పుకుంటారు. ఇంత పెద్ద ఉద్యోగం, ఇంత పెద్ద ఇల్లు, ఇంత పెద్ద హోదా ఉన్నవాడు ఆ పేదపిల్లకు దొరకడం అంటే మామూలు విషయమా? దాని అదృష్టమనే చెప్పాలే..." అంది సుధేష్ణ.

* * *

రమణమూర్తికి వసంతతో పెళ్ళయింది.

పెళ్ళయిన వెంటనే వసంత రమణమూర్తి ఇంటికొచ్చేసింది. వసంత నిజంగానే చాలా అమాయకురాలు. భార్యంటే భర్తకు అణిగిమణిగి ఉండాలని మాత్రమే ఆ అమ్మాయికి తెలుసు.

అతడేపని చెబితే ఆపని చేసేది.

అత్తగార్ని దేవతలా చూసుకునేది.

అతడు అతని ఫ్రెండ్స్‌ని ఇంటికి తీసుకొచ్చి గంటలకుగంటలు తాగుతూ కూర్చొనేవాడు. ఒకరోజు వెంకటేశ్ వచ్చాడు.

"ఈసారి నీకు తప్పకుండా పిల్లలు పుడ్తారు గురూ.. పెద్ద పార్టీకి రెడీగా ఉండాలె.." అన్నాడు.

"పార్టీలివ్వడానికి మనమెప్పుడూ రెడీనే" అన్నాడు రమణమూర్తి.

"సరేగాని ఈ న్యూస్ విన్నావా?" అన్నాడు వెంకటేశ్.

"యే న్యూస్?"

"మన జయకుమారి వాళ్ళ మేనబావను పెళ్ళి చేసుకొని స్టేట్స్‌కు వెళ్ళిపోయిందట. అతడు స్టేట్స్‌లో పెద్ద ఉద్యోగం చేస్తున్నాట్ట... ఆమె ప్రెగ్నేన్సీకి

కారణం వాళ్ళ బావగారేనట... ఇప్పుడే పిల్లలొద్దనుకొని ఆమెను అబార్షన్ చేసుకొమ్మన్నాట్ట..." అన్నాడు వెంకటేశ్.

"అన్నీ అట అటలే లేరా... వాస్తవం నాకు తెలుసు. కొన్ని రోజులు అది నాతో తిరిగింది... మా బావగారు స్టేట్స్‌లో ఉన్నాడని, అతన్నే చేసుకుంటానని నాతో చెప్పేది... ఇప్పుడు దానిగొడవెందుకు... పోనీయ్... ఇట్లాంటి సొళ్ళు కబుర్లు చెప్తే తంతాను" అన్నాడు రమణమూర్తి.

"చెప్పను లేరా. త్వరలో నువ్వ తండ్రివి కావాలని నేను రోజు ఆయేడుకొండలవాడికి పూజలు చేస్తున్నాను" అన్నాడు వెంకటేశ్ రెండోరౌండ్‌ను పూర్తిచేసి మూడో రౌండులోకెళ్తూ..

* * *

సంవత్సరం గడిచిపోయింది.

వసంత తనకో కొడుకునో, కూతుర్నో ప్రసాదించమని రోజు దేవుడ్ని ప్రార్థించేది. రోజో గుడికి వెళ్ళి పూజలు చేసేది. రెండుసార్లు తిరుపతిక్కూడా వెళ్ళొచ్చింది. ఎవరో ఫలానా గుడికెళ్ళి పొర్లు దండాలు పెడ్తే పిల్లలు పుడ్తారంటే ఆగుడిక్కూడా వెళ్ళి పొర్లు దండాలు పెట్టింది. జ్యోతిష్యుల దగ్గరకెళ్ళింది. బాబాల దగ్గరకెళ్ళింది. భర్తను ఒప్పించి యజ్ఞాలు, యాగాలు కూడా చేసింది.

అయినా ఫలితం దక్కలేదు.

ఆమె కడుపు పండలేదు.

అతడామె మీద అరవడం ఎక్కువైపోయింది. తాగడం ఎక్కువైనప్పుడు ఆమె మీద అరవడం, చెయ్యిచేసుకోవడం కూడా ఎక్కువైపోయింది.

"ఇంకో ఆర్నెల్లలో నీకు నెల తప్పకపోతే నిన్ను వదిలేస్తాన"ని బెదిరించడం ఎక్కువైపోయింది. అతడు కొట్టేదెబ్బల్ని ఆమె ఓపిగ్గా భరించేది. ఎన్ని తిట్లు తిట్టినా కిమ్మనకుండా వినేది. త్వరలోనే దేవుడు తనను కరుణిస్తాడనీ, తన కష్టాలన్నీ తీరిపోతాయనీ ఆమె కలలన్నీ నిజమౌతాయనీ ఆమె కలలుగంటుండేది.

సుధేష్ణ రమణమూర్తి ఇంటికి వచ్చి పోతూనే ఉండేది. ఒకసారి సుధేష్ణ రాగానే "భలే సంబంధం చూశావే అక్కయ్యా! మరో గొడ్రాల్ని తెచ్చి నాకు అంటగట్టావు. ఇది వట్టిమొద్దు. గొడ్డులా పనిచెయ్యడం తప్ప దానికేం తెలీదు. దాని శరీరంలో అసలు ఆడదాని లక్షణాలే లేవు" అన్నాడు రమణమూర్తి.

"పాపం అది మంచి పిల్లేరా. ఇందుకిట్లా జరుగుతున్నదో అర్థం కావడం లేదు." అంది సుధేష్ణ.

"లాభం లేదక్కా.... దీన్ని వదిలేసి మరోదాన్ని చేసుకుంటాను" అన్నాడు రమణమూర్తి

"అప్పుడే అంత తొందర పాటొద్దురా..... ఇంకో ఐదారు నెల్లు చూద్దాం..." అంది సుధేష్ణ

"యేమొనే సుధేష్ణ.... నేను బతికుండగా వాడికో కొడుకు పుడ్తాడన్న ఆశ నాకైతే పోతున్నది" అంది శాంతమ్మ.

మరో సంవత్సరం గడిచింది.

వసంత కడుపు పండలేదు.

అతడికి ఓపిక నశించి పోయింది.

"ఆరునెల్లు గడిచాయి.. సంవత్సరము గడిచింది. ఇక దానికి పిల్లలు పుట్లరు. అమ్మ ఆరోగ్యం కూడా క్షీణిస్తోంది. అమ్మ బతికుండగానే నాకో కొడుకు పుట్టాలన్న ఆమె కోరికను తీర్చలేకపోయాను!!" అన్నాడు రమణమూర్తి అప్పుడే వచ్చిన సుధేష్ణతో.

"అయితే యేం చేద్దామంటావు? "అంది సుధేష్ణ.

"ఇంకో దాన్ని చేసుకుంటాను".

"దీన్నేం చేస్తావు?"

"నువ్వే చెప్పు....."

"అదొట్టి వెర్రిగొడ్డు. మనం ఎట్లా చెబితె అట్లా వింటుంది. నీకు పిల్లలు పుట్టలేదు కాబట్టి ఇంకోదాన్ని చేసుకుంటున్నానంటే గంగిరెద్దులా తలూపుతుందే తప్ప గొడవ చెయ్యదు. దాన్ని పొమ్మనకుండా ఇంట్లోనే ఉంచుకుంటే బోల్డు పని చేసి పెడ్తుంది."

"అలాగే చేద్దాం.... ఈసారి మరీ వయసు మళ్ళిన వాళ్ళను చేసుకోను. పదిహేను పదహారేళ్ళ పిల్లలైతేనే త్వరగా గర్భవతులౌతారని మొన్ననే ఓవారపత్రికలో చదివాను....ఈసారి ఓచిన్న పిల్లను, అంటే పదహారేళ్ళు దాటని అమ్మాయిని చూడవే అక్కయ్యా " అన్నాడు రమణమూర్తి.

"అలా అయితే నువ్వుమా సుహాసినినే చేసుకో... దాన్ని బాగా చదివిద్దామనుకున్నాం. ఓడాక్టర్నో, ఇంజనీర్నో చేద్దామనుకున్నాం. ఇదేమొ ఇంటర్ ఫెయిలయి ఇంట్లో కూర్చుంది. దాంతో మీబావగార్కి మనసిరిగి పోయింది. దానికి

వెంటనే పెళ్ళి చేసేద్దామంటున్నాడు. ఎక్కడో వెతుక్కోవడం దేనికి... నీకేంతక్కువని. దానికి నీకన్నా గొప్పవాడు దొరుకుతాడా?" అంది సుధేష్ణ.

"కానీ అక్కయ్య....నాకిప్పుడు 35యేళ్ళు.... దానికి 16 కూడా నిండలేదు.. ఇంత ఏజ్‌డిఫరెన్స్....ఎవరో, యే పేదపిల్లో అయితే ఫరవాలేదనుకున్నాను. కానీ స్వయంగా నీకూతుర్ని, నామేనకోడల్ని ఎలా చేసుకొమ్మంటావు? ఆ పసిదానికింత అన్యాయం చెయ్యడం న్యాయమేనంటావా? వద్దక్కయ్యా...వద్దు. సుహాసినికి దాని వయస్సు తగ్గవాడిని చూద్దాం. ఇది వరకటిలాగే నాకో పేదవాళ్ళ అమ్మయిని, మూడో సంబంధమైనా దొరికిందే బంగారమనుకునే వాళ్ళ అమ్మాయిని చూడు........"

"వద్దురా తమ్ముడా! నీకు సుహాసినైతేనే బావుంటుంది. నాకు పదహారేళ్ళకే అది పుట్టింది. తల్లి సాలు బిడ్డల కొస్తుందంటారు. దానిక్కూడా పదహారేళ్ళకే పిల్లలు పుడ్తారు. అమ్మ కూడా సంతోషిస్తుంది. మీబావగార్ని ఈపెళ్లికి ఒప్పిస్తాను"

"కానీ సుహాసిని ఒప్పుకుంటుందా...... అదిమొదలే అల్లరిపిల్ల....ఇంత వయస్సు మళ్ళినవాడిని చేసుకుంటానా అని ఎంత గొడవ చేస్తుందో...."

"యేం గొడవ చెయ్యదు. దానికి నువ్వంటే చాలా ఇష్టం. నాకు మామయ్యలా అందంగా ఉండే అబ్బాయేకావాలని అది చాలా సార్లంది. నువ్వు చిరంజీవిలా ఉంటావట. దానికి చిరంజీవంటే చచ్చేంత ఇష్టం. నిన్ను చేసుకుంటే అది చిరంజీవిని చేసుకున్నట్టే మురిసిపోతుంది. అదెప్పుడూ నీకబుర్లే చెబుతుంటుంది. మామయ్యకు పిల్లలు పుట్టక పోకడమేమిటి.......నన్ను చేసుకోమను.... సంవత్సరం తిరక్కుండానే ఓకొడుకును కనేస్తానని చెప్పు అని చాలా సార్లంది. త్వరగా పెళ్ళి చేసుకొని పిల్లల్ని కనాలన్న కోరికే తప్పదానికి పెద్దగా చదువుకోవాలని లేదు. అందుకే దానికి చదువబ్బలేదు"

"నువ్వు చెప్పిందంతా వింటోంటే ఈఐడియా బాగానే ఉందనిపిస్తోంది." అన్నాడు రమణమూర్తి

వాళ్ళిద్దరిలా మాట్లాడుకుంటున్నప్పుడే అక్కడికి వాళ్ళమ్మ వచ్చేసింది.

"అక్కయ్య చెప్పినట్టు చెయ్యరా రమణ.. పెళ్ళయిన తొమ్మిది నెలలకే నామనవరాలు నాచేతిలో ఓమనవడ్ని పెడ్తుంది." అంది శాంతమ్మ.

"అయితే మీఇష్టం" అన్నాడు రమణమూర్తి.

* * *

రెండునెలల్లోనే ముప్పయిఆరేళ్ళ రమణమూర్తికి పదహారేళ్ళ సుహాసినితో రహస్యంగా ఓ దేవుడిగుళ్ళో పెళ్ళయిపోయింది.

రమణమూర్తి రెండో భార్య వసంత ఆ ఇంటి పనిమనిషిగా మారిపోయింది.

మూడోభార్య సుహాసినితో కలిసి రమణమూర్తి నెలరోజులపాటు హానీమూన్ కెళ్ళొచ్చాడు.

సుహాసినిని నగలతో, చీరెలతో ముంచెత్తాడు. ఆమె యేం కావాలంటే అది క్షణాల్లో తెచ్చి ఆమె చేతిలో పెట్టాడు. తనుకూడా పాతికేళ్ళ కుర్రాడిలా కనిపించడానికి మెన్స్ బ్యూటిపార్లర్ల చుట్టూ తిరిగాడు.

ఆరునెలలు గడిచిపోయాయి.

యే క్షణంలోనైనా సుహాసిని నెలతప్పిందన్న వార్త వింటామని సుధేష్ణ, శాంతమ్మ, రమణమూర్తి అనుక్షణం ఎదురుచూడసాగారు. కానీ సుహాసినికి తల్లయ్యే యోగం పట్టలేదు.

ఒకరోజు సుధేష్ణ రమణమూర్తితో "మీరిద్దరూ కలిసి ఒకసారి డాక్టర్ దగ్గరికి వెళ్ళిరండిరా" అంది.

"ఈ ఊరికి డాక్టర్ విజయరామారావని ఓ కొత్త డాక్టర్ వచ్చాట్ట. చాలా మంచి డాక్టరట. పిల్లలు లేని వాళ్ళందరూ అతని దగ్గరికే వెళ్తున్నారట. ఆయన "ప్రశాంతి సంతాన సాఫల్య కేంద్రం" అనే పేరుతో ఈ ఊర్లో ఓ హాస్పిటల్ పెట్టాడట.. మీరిద్దరూ వెళ్ళి అతన్ని కలిసి ఆతడేం చెబుతాడో వినిరండి" అంది సుధేష్ణ.

"ఇద్దరం ఎందుకు? దాన్ని తీసికెళ్ళి చూపించు" అన్నాడు రమణమూర్తి.

"పిల్లలు పుట్టనప్పుడు భార్యాభర్తలిద్దరూ వెళ్ళి చూపించుకోవాలని అందరూ చెబుతున్నారు"

"అలాగా చెబుతార్లే... నాలో యేలోపమూ లేదు. అందుకు రుజువులు కూడా ఉన్నాయి..."

"యేం రుజువులున్నాయిరా?"

"అవన్నీ నీకు చెప్పేటివి కావులే. ముందలైతే దాన్ని తీసికెళ్ళి చూపించుకొనిరా.." అంటూనే రమణమూర్తి బయటికెళ్ళిపోయాడు.

ఆమర్నాడు సుధేష్ణ, సుహాసినిని డా॥ విజయ రామారావు దగ్గరకు తీసికెళ్ళింది.

ఆమెకు చెయ్యాల్సిన పరీక్షలన్నీ చేశారు. ఆమెలో యే లోపమూలేదని చెప్పారు.

"ఈమె భర్తను కూడా తీసుకరండి... అతన్ని కూడా పరీక్ష చెయ్యాలి" అన్నాడు డా॥ విజయరామారావు.

ఈ విషయమే సుధేష్ణ రమణమూర్తితో చెప్పింది" నువ్వు కూడా రేపోసారి వెళ్ళి ఆ డాక్టర్ని కలిసిరారా" అంది సుధేష్ణ.

"ఈ డాక్టర్లు అలాగే చెబుతార్లే... పరీక్షల పేరుతో బోల్డు డబ్బు దండుకోవడం కోసమే అలా చెబుతారు. నాలో యేలోపమూ లేదు. నాకే పరీక్షలూ అక్కర్లేదు" అంటూ రమణమూర్తి బయటకెళ్ళిపోయాడు.

మరోసారి సుధేష్ణ అతన్ని నిలదీసింది.

"లోపంలేదని నువ్వనుకుంటే సరిపోతుందా? ఆ విషయం డాక్టర్లు చెప్పాలి... ఒకసారి డాక్టర్ దగ్గరకు వెళ్ళమంటే వెళ్ళనని ఎందుకింత మొండికేస్తున్నావో నాకర్థం కావడం లేదు" అంది సుధేష్ణ.

"నువ్వు కూడా ఎందుకింత మొండికేస్తున్నావో నాకర్థం కావడంలేదు... నాలో యేలోపమూలేదని నెత్తీనోరు బాదుకున్నా వినవేం? నా కారణంగా ఇద్దరు స్త్రీలు గర్భవతులయ్యారన్న సంగతి నీకు తెలుసా?" అరచినట్టుగా అన్నాడు రమణమూర్తి.

"ఎవర్రా ఆ ఇద్దరు స్త్రీలు?"

"పెళ్ళికాకముందే నేనో అమ్మాయిని ప్రేమించాను. ఎలాగూ పెళ్ళి చేసుకుంటామన్న నమ్మకంతో మేమిద్దరం అప్పుడప్పుడు కలుసుకున్నాం. ఆమె ప్రెగ్నంటయ్యింది. కానీ మా పెళ్ళికి ఆమె తల్లిదండ్రులొప్పుకోలేదు.. ఆమెకు అబార్షన్ చేయించి మరొకడికిచ్చి పెళ్ళి చేశారు... ఇంతకన్నా ఇంకేం రుజువులు కావాలి?" అన్నాడు రమణమూర్తి.

"అలాగా... ఈ సంగతి మాకెప్పుడూ చెప్పనేలేదేమిట్రా?" అంది సుధేష్ణ.

"ఇలాంటివన్నీ ఎలా చెప్పమంటావు?" అన్నాడు రమణమూర్తి.

"సరె... అదెప్పుడో జరిగింది... అప్పటికీ ఇప్పటికీ నీలో ఎన్నిమార్పులు జరిగాయో ఒకసారి పరీక్ష చేయించుకుంటేగానీ తెలీదు. నువ్వోసారి డాక్టర్ దగ్గరకు వెళ్ళి రావాలిరా తమ్ముడూ... యేదన్నా లోపం ఉంటే డాక్టర్లు సరిజేస్తారు... ఎన్నో మందులొచ్చాయి, ఎన్నో ఆపరేషన్లొచ్చాయి...."

"అబ్బబ్బబ్బ... యేమిటీ సొద... మందులు డాక్టర్లు... పరీక్షలు... ఇవంటే నాకు చాలా అసహ్యం...

"ఎంత అసహ్యమైనా కొన్ని పనులు చెయ్యక తప్పదు... పిల్లలు పుట్టకపోతే సుహాసిని గతేంకావాలి? దాన్ని కూడా వదిలేసి నాల్గోదాన్ని చేసుకుంటావా?"

"చేసుకోను... నాల్గోదాన్ని చేసుకోను.. నాకర్మ ఇంతేనని నోర్మూసుకొని పడుంటాను... సరేనా?"

"లేదు... నువ్వోసారి డాక్టర్‌దగ్గరకు వెళ్ళిరావాలె... యేదన్నా లోపముంటే డాక్టర్లు మందులిచ్చో, ఆపరేషన్ చేసో దాన్ని సరిచేస్తారు... అప్పుడు సుహాసిని కడుపు పండుతుంది. మేమందరమూ సంతోషిస్తాం... నామాట విని రేపే ఓసారి వెళ్ళి డాక్టర్‌ను కలుసుకో..."

"అలాగే తల్లీ... అలాగే... వెళ్తాను... డాక్టర్ దగ్గరకు వెళ్తాను. ఇకనైనా నన్ను వదుల్తావా? నాకోసం నా ఫ్రెండ్స్‌oదరూ వెయిట్ చేస్తున్నారు..." అంటూనే రమణమూర్తి వెళ్ళి బార్లో అతనికోసం ఎదురుచూస్తున్న అతని ఫ్రెండ్స్‌ని కలిశాడు.

ఆ మర్నాడు రమణమూర్తి డాక్టర్ విజయరామారావుతో అపాయింట్‌మెంట్ తీసుకొని అతన్ని కలుసుకున్నాడు.

"రమణమూర్తంటే మీరేనా?" అన్నాడు డా॥ విజయరామారావు.

"అవును... ఆర్డీవో రమణమూర్తిని నేనే..." అన్నాడు రమణమూర్తి.

"నైస్ మీటింగుయూ ఆర్డీవో గారు"

"థాంక్యూ డాక్టర్... నాకే సమస్యలులేవు.. చాలా హాయిగానే ఉన్నాను. కానీ ఒకటే సమస్య... మాకు పిల్లల్లేరు.. రాత్రింబవళ్ళు ఈ సమస్యే నన్ను వేదిస్తున్నది..."

"అవును. మీవైఫ్‌కు అన్ని పరీక్షలు చేశాం. ఆమెలో యేలోపమూ లేదు. మిమ్మల్ని కూడా ఒకసారి..."

"అవసరం లేదు డాక్టర్... నాలో కూడా యేలోపమూ లేదని చెప్పడానికి రుజువులున్నాయి..."

"యేమిటా రుజువులు?"

"నా స్టూడెంట్ డేస్‌లో నేనో అమ్మాయిని ప్రేమించాను. పెళ్ళి చేసుకుందామని కూడా అనుకున్నాం. అయితే ఆ అమ్మాయి తల్లిదండ్రులు మా పెళ్ళికి అంగీకరించలేదు. అప్పటికే మేం రెండు మూడుసార్లు శారీరకంగా కలిసాం. ఆ అమ్మాయి ప్రెగ్నెంటయ్యింది. ఈ విషయం తెలిసి కూడా ఆ అమ్మాయి తల్లిదండ్రులు మా పెళ్ళికి అంగీకరించలేదు. బలవంతంగా అబార్షన్ చేయించి మరొకడితో పెళ్ళి జరిపించారు. దీసీజ్ ఎ ఫాక్ట్"

"మేబీ... ఇది జరిగి ఎంతకాలమైంది?"

"పదేళ్ళయ్యుంటుంది... అప్పుడు నావయస్సు ఇరవైఐదు"

"ఇప్పుడు మీ వయస్సు?"

"ముప్ఫయ్యారు..."

"ఎనీవే... ఒకసారి మీ వీర్యాన్ని పరీక్షజేస్తే తప్ప యేమీ చెప్పలేం..."

"అవసరం లేదు... అప్పటికీ ఇప్పటికీ నాలో యే మార్పులేదు... నాలో పుంసత్వం యేమీ తగ్గలేదు. ఒక్కరోజు కూడా నేను నా భార్యను చూడకుండా ఉండలేను..."

"నిజమే కావొచ్చు... కానీ మీ వీర్యంలో స్పెర్మ్‌కౌంట్ ఎంతో చూడాలి. సరిపోయేటన్ని శుక్లకణాలు లేకపోతే మీకు పిల్లలు పుట్టరు... కాబట్టి మీ వీర్యాన్నొకసారి పరీక్ష చెయ్యాలి..."

"అవసరం లేదని చెబుతోంటె వినిపించుకోరేమిటి? నాలో యేలోపమూ లేదని నాకు హండ్రెడ్ పర్సెంట్ నమ్మకముంది. లోపమంతా నా భార్యలోనే ఉండాలి... లేదా దేవుడు మాకు సంతానాన్ని రాయడం మరచిపోయైనా ఉండాలి"

"ఓ క్వాలిఫైడ్ అండ్ ఎక్స్‌పీరియన్స్‌డ్ డాక్టర్‌గా చెబుతున్నాను. మిమ్మల్నొకసారి పరీక్ష చెయ్యాలి. లోపమేమిటో తెలిస్తే దాన్ని సరిచెయ్యటానికి ప్రయత్నించొచ్చు... ఇప్పటికే మీరు మూడుసార్లు పెళ్ళి చేసుకున్నట్టు తెలిసింది. అయినా మీకు పిల్లలు పుట్టలేదంటే మీలోనే యేదో లోపం ఉండితీరాలి. ఆలోపమేమిటో తెలుసుకుంటే మీ సమస్యకు పరిష్కారాన్ని కనుక్కోవచ్చు..."

"మీరే పరిష్కారాన్ని కనుక్కోవాల్సిన అవసరం లేదు". అంటూనే రమణమూర్తి దిగ్గున లేచి బయటకొచ్చాడు.

కానీ రెండ్రోజుల తర్వాత మళ్ళీ వచ్చాడు.

"ఆల్‌రైట్ డాక్టర్... యేం పరీక్షలు చేస్తారో చెయ్యండి" అన్నాడు.

* * *

రమణమూర్తికి పరీక్షలు జరిగాయి.

రిపోర్ట్స్ వచ్చాయి.

రమణమూర్తి డాక్టర్ దగ్గరకొచ్చికూర్చున్నాడు.

"నారిపోర్ట్స్ వచ్చాయా డాక్టర్..." అన్నాడు.

"ఇదిగో... ఇవి మీ రిపోర్ట్స్..." అన్నాడు డాక్టర్.

"నార్మల్‌గానే ఉన్నాయి కదా..."

"నార్మల్‌గా లేవు ఆర్డీవోగారు... ఒక ఆరోగ్యవంతుడైన పురుషుడి వీర్యంలో యాభై నుండి అరవై మిలియన్ల స్పెర్మ్స్... అంటే శుక్లకణాలుండాలి... కానీ మీ వీర్యంలో అవి చాలా తక్కువగా ఉన్నాయి... ఒక మిలియన్ కూడా లేవు. మరో విషయమేమిటంటే వాటి కదలిక కూడా చాలా తక్కువగా ఉంది. ఈ కారణం వల్లనే మీకు సంతానం కల్గటం లేదు..." అన్నాడు డా॥ విజయరామారావు.

"హౌకెన్ ఇట్ బీ... నా వల్ల ఒక స్త్రీ...."

కావచ్చు... అప్పటికీ ఇప్పటికీ మీ శరీరంలో చాలా మార్పులు జరిగుంటాయి. మీకు అతిగా ఆల్కహాల్ తీసుకునే అలవాటుందని తెలిసింది... అతిగా స్మోక్ కూడా చేస్తారని తెలిసింది..."

"ఎవరు చెప్పారు?"

"స్వయంగా మీ అక్కగారే చెప్పారు..."

"అతిగా యేం చెయ్యను... ఎప్పుడైనా ఫ్రెండ్స్‌తో వన్ ఆర్ టూ పెగ్స్..."

"లేదు... మీరు అబద్ధం చెబుతున్నారు... రోజు బాటిల్స్‌కు బాటిల్స్ తాగేస్తారని తెలిసింది... అలాగే మీరు చైన్ స్మోకర్ అని కూడా తెలిసింది. ఇవి రెండు మీ శరీరాన్ని పాడు చేశాయి. మీ వీర్యంలోని శుక్లకణాల్ని దెబ్బ తీశాయి..."

"రబ్బిష్... యూ ఆర్ టాకింగ్ రబ్బిష్...." అరచినట్టుగా అన్నాడు రమణమూర్తి.

"కూల్‌డౌన్ రమణమూర్తి గారూ! కావాలంటే మీరు మరోచోటికి వెళ్ళి పరీక్ష చేయించుకొండి..."

"లోపముంటే పరిష్కారం కూడా ఉంటుందన్నారు కదా... పరిష్కారమేమిటో చెప్పండి"

"పరిష్కారం ఏమీలేదు... మీరు తండ్రయ్యే అవకాశం కనిపించదంలేదు... మీరు ముందే ఇలాంటి పరీక్షలు చేయించుకుంటే... మీ మొదటి భార్యతోటే సంతానం కల్గనప్పుడే ఈ టెస్టులు చేయించుకొని ఉంటే మరో ఇద్దరి స్త్రీల జీవితాల్ని నాశనం చేసేవారు కాదు..."

"షటప్ మిస్టర్ విజయరామారావు... మీరు నా పర్సనల్ విషయాలు మాట్లాడుతున్నారు.."

"ఇవి మీ పర్సనల్ విసయాలు కావు. ఇదో సామాజిక సమస్య. మీలాంటి బాగా చదువుకున్న వాళ్ళు కూడా పిల్లలు పుట్టకపోవడానికి కేవలం స్త్రీలే కారణమనుకుంటారు. పురుషులు కూడా కారణం కావచ్చునన్న ఆలోచనే మీకు రాదు"

"నోనోనో... నాలో యే లోపమూ లేదు. నేను చేసుకున్న స్త్రీలల్లోనే లోపముంది నేను మరో దాన్ని పెళ్ళి చేసుకొని పిల్లల్ని కని మీకు చూపిస్తాను. దిసీజ్ మై ఛాలెంజ్!"

"మీరు మరోసారి పెళ్ళి చేసుకుంటే మిమ్మల్ని జైలుకు పంపిస్తాను. అప్పుడు మీ ఉద్యోగం కూడా పోతుంది. ఒక బాధ్యతకల్గిన ఉన్నతాధికారిగా పనిచేస్తూ, మీలోనే లోపముందని తెలిసి కూడా నాల్గుసార్లు పెళ్ళిచేసుకుంటారా? బైగమీ... ఆర్ బహు భార్యాత్వం చట్టరీత్యా నేరమని మీకు తెలీదా?"

రమణమూర్తికి చెమటలు పట్టాయి. గొంతు తడారిపోయింది.

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు డాక్టర్?" అతి కష్టంగా అతని గొంతులోంచి ఈ మాటలు వెలువడ్డాయి.

"మీ మేనకోడల్ని ఆమె వయస్సుకు తగిన వాడికిచ్చి పెళ్ళిచెయ్యండి. ఎవరో ఒకరు తప్పకుండా దొరుకుతారు. మీరు మీ రెండో భార్య వసంతతో కాపురం చెయ్యండి. యే అనాథ ఆశ్రమం నుండో ఓ యేడాది పాపనో, బాబునో తెచ్చుకొని మీకు పుట్టినట్టుగానే భావించి పెంచుకోండి... ఇలా చేస్తేనే మీ పాపానికి నిష్కృతి లభిస్తుంది" అన్నాడు డాక్టర్ విజయరామారావు.

రమణమూర్తి నిశ్శబ్దంగా డాక్టర్ గదిలోంచి బయటకు వెళ్ళిపోయాడు.

మళ్ళీ ఆరునెలలు తర్వాత డాక్టర్ దగ్గరకొచ్చాడు.

"మీరు చెప్పినట్టే చేశాను డాక్టర్!" అన్నాడు రమణమూర్తి డాక్టర్ విజయరామారావుతో చేతులు కలుపుతూ.

****

**– 'స్వాతి' (మంత్లీ), జనవరి, 2007**



కథా నిలయం
శ్రీకాకుళం